## విరాటపర్వ కథాంశాలు

విరాట పర్వమున అయిదు ఉప పర్వములు 2589 శ్లోకములుగలవు.

### 1) పాండవ ప్రవేశపర్వము:-

ఈ ఉప పర్వమున 12 అధ్యాయములు గలవు. జనమేజయుడు అడుగగా వైశంపాయనుడు విరాటనగరమున పాండవుల అజ్ఞాత వాసముగూర్చి చెప్పెను. అజ్ఞాతవాసమున పాండవులు ఎచ్చట ఉన్నను ప్రజలచే గుర్తింపబడజాలరని ధర్మదేవత వరమునుబొంది యుధిష్ఠిరుడు తన ఆశ్రమమును జేరి విషయమంతయు వారికి చెప్పి అరణితో కూడా మంథనకాష్ఠమును వారికి అప్పగించెను. ధర్మరాజు తన సోదరులతో ఇట్లు చెప్పెను. పంద్రెండు సంవత్సరములు వనవాసము పూర్తి చేసితిమి. పదమూడవ సంవత్సరము గుప్తరూపముగ అజ్ఞాతవాసము చేయవలెను. అర్జునా! శత్రువులు కనుక్కోలేని మంచి ప్రదేశమును అజ్ఞాతవాసమునకై సూచింపుము. అంతట అర్జునుడు అజ్ఞాతవాసమునకు అనుకూలమైన కొన్ని ప్రదేశములను సూచించెను. వానిలో విరాటనగరమును ఎన్నుకొని ధర్మరాజు సోదరులతో మనం విరాటరాజు కొలువులో ఏయే పనులను నిర్వహించగలము. నాకు ద్యూత క్రీడ తెలుసు కనుక కంకుడను బ్రాహ్మణ వేషమున రాజాస్థానమున ప్రవేశించగలనని చెప్పెను. బల్లవుడను పేరుతో పరిచయంచేసుకొని వంటవానిగానుండగలనని భీముడు చెప్పెను. నపుంసకరూపమును బొంది బృహన్నల అను పేరుతో పరిచయం చేసుకొని విరాటనగర అంతఃపురస్త్రీలకు గీత, వాద్య, నృత్యముల యందు శిక్షణ నిచ్చెదనని అర్జునుడు చెప్పెను. నేను అశ్వవిద్యయందు కుశలుడను, కనుక గ్రంథికుడను పేరుతో పరిచయం చేసుకొని గుఱ్ఱములను వశము చేసుకొను కార్యమును నిర్వహించెదని నకులుడు పలికెను. గోవులను పాలించుట పోషించుట బాగా తెలియును కనుక తంతిపాలుడను పేరుతో గోశాల అధ్యక్షునిగా విరాటుని వద్ద మెలగగలనని సహదేవుడు పేర్కొనెను.

యుధిష్ఠిరుడు ద్రౌపదిని గూర్చి ఆలోచించు చుండగా ఆమె మహారాజా! నేను సైరంధ్రిగ పరిచయము చేసుకొందును. కేశ సంస్కారము గూర్చి నేను బాగా యెరుగుదునని పలికెను. ఈ విధంగా పాండవులు పరస్పరం చర్చించుకొని ధౌమ్యుని సమ్మతిని తీసుకొన్నారు. పిమ్మట

ధౌమ్యుడు రాజగృహమున ఎట్లు వ్యవహరించవలెనో పాండవులకు ఉపదేశించెను. తదనంతరము పాండవులు ద్రౌపదితో కూడి విరాట నగరమునకు బయలుదేరిరి. విరాట నగరము పొలిమేరలకు వెళ్ళిన పిమ్మట

యుధిష్ఠిరుడు అర్జునుని, నగరములోనికి ప్రవేశించుటకు ముందు అస్త్రశస్త్రములను ఎక్కడ ఉంచెదమని ప్రశ్నించెను. అర్జునుడు శ్మశానభూభాగమున పెద్దశమీవృక్షముకలదు. దానిపైకి ఎక్కుటయే కష్టము. అదంతయు నిర్జన ప్రదేశము. ఆచెట్టుపై అస్త్రములను ఉంచుటను ఎవ్వరూ గమనించలేరని చెప్పెను. పిమ్మట అచ్చటకు చేరి చెట్టుపై అస్త్రములనుంచమని ధర్మరాజు నకులుని ఆదేశించెను. అతడు చెట్టునెక్కి తొర్రలలో ఆయుధములనుంచి గట్టి త్రాళ్ళతో వాటిని కట్టెను. పిమ్మట మృతశరీరమును తీసుకు వచ్చి చెట్టుకొమ్మకు వ్రేలాడదీసిరి. దానిని చూసి భయపడి ప్రజలు దాని దగ్గరకు రాకుండా ఉంటారని వారి అభిప్రాయము. పిమ్మటవారు విరాటనగరమును చేరిరి. ప్రవేశించుటకు ముందు యుధిష్ఠిరుడు దుర్గాదేవి స్తోత్రమును చేసెను. తల్లిదుర్గ వారి యెడల అపార కటాక్షమును అనుగ్రహించెను. పాండవులను రక్షించు భారమును మీద వేసుకొని దుర్గామాత అంతర్ధానమాయెను. తదనంతరము వారి వారి వేషములకు తగ్గట్లు తమ తమ పనులలో నిమగ్నమైతిరి.

**2) సమయపాలన పర్వము:-**

ఇందు పదమూడు అధ్యాయములుగలవు. మత్స్యదేశ రాజధానిలో పాండవులు విరాటుని సేవిస్తూ అజ్ఞాతవాసమును చేయసాగిరి. జనమేజయుడు అడుగగా వైశంపాయనుడు విరాటుని కొలువులో పాండవులు ఏయేపనులు నిర్వహించితిరో విపులముగా వివరించెను. యుధిష్ఠిరుడు ద్యూతశాలలో పాచికలతో రాజు మున్నగు వారిని ద్యూతమాడించెడివాడు. పాండవులు తాము చేసెడి గొప్ప పనులకు తమకు లభించెడి పురస్కారములను పరస్పరము పంచుకొనెడి వారు. ద్రౌపదికూడా యథావకాశము తన భర్తల యోగక్షేమములను గమనించెడిది. తల్లి గర్భంలో తొమ్మిది నెలులు ఉన్నట్లు పాండవులు విరాటుని కొలువులో దాగియుండిరి.

అజ్ఞాతవాసమున మూడు నెలలు పూర్తి అయి నాల్గవ నెల

ఆరంభమాయెను. ఆసమయమున మత్స్యదేశమున బ్రహ్మోత్సవము జరిగెను. అందు పాల్గొనుటకు నలుదిశలనుండి వేలకొలది మల్లయోధ్ధులు వచ్చిరి. వారందరిలో గొప్ప మల్లయోధుడు తనతో యుద్ధము చేయమని అందరిని రెచ్చగొట్టసాగెను. కాని ఎవ్వరూ అతని యెదుట నిలువ లేకుండిరి. అది గమనించి విరాటరాజు తనయింటి వంటవాడగు భీమసేనుని గర్వపడు మల్లునితో యుద్ధము చేయమని ఆదేశించెను. రాజాజ్ఞను భీముడు శిరసావహించెను. భయంకర యుద్ధమున భీముడు మల్లుని చంపి క్రిందపడవేసెను.

రాజు ఎంతో సంతోషించి అతనికి ఎన్నో కానుకలిచ్చెను. ఈవిధంగా పాండవులు విరాటుని సంతోషపెడుతూ రహస్యంగా గడపసాగిరి.

### 3) కీచక వధపర్వము:-

ఇందు పదకొండు అధ్యాయములుగలవు. విరాటనగరమున పాండవుల అజ్ఞాతవాసము ప్రారంభమై పదినెలలు గడిచెను. ద్రౌపది రాణి సుదేష్ణకు సేవలు చేస్తూ అంతఃపురమున ఉండెడిది. అజ్ఞాతవాసము పూర్తియగుటకు కొద్దికాలము మాత్రమే మిగిలియున్నది. ఒకరోజున విరాటరాజుసేనాపతి కీచకుడు అంతఃపురమున ద్రౌపదిని చూచి పరవశుడాయెను. అతడు తనసోదరి సుదేష్ణవద్ద తన మనస్సులోని మాటను చెప్పెను. ద్రౌపది సుదేష్ణవద్ద పరిచారికయని అతడు తెలుసుకొనెను. కీచకుడు ఆమెవద్దకు వెడలి తనకోరికను ప్రకటిస్తూ చంద్రముఖి! నేనునా ముందరి భార్యలనందరిని విడిచిపెట్టెదను. వారంతా నీకు దాసీలై ఉండెదరు. నేను కూడా నీకు దాసుడనే అని పలికెను. అది విని ద్రౌపది సూతపుత్ర! పరిచారికయెడల ఈవిధముగా ప్రేమను ఒలకబోయుట నీకు తగదు. నేను మరొకరికి భార్యను. అట్టివారిని కామించుట తగదని ఉపదేశించెను. ద్రౌపది ఉపదేశములకు అతనిలో ఎటువంటి మార్పురాలేదు. అతనిలో కోర్కె ఇంకనూ పెరిగి నీచపు మాటలను మాట్లాడెను. అప్పుడు ద్రౌపది అతనిని హెచ్చరిస్తూ నాభర్తలగు అయిదుగురు గంధర్వులు నిరంతరము నన్ను రక్షిస్తూ ఉంటారు. అనుచితముగ వ్యవహరించిన కోపగించి నిన్ను చంపగలరు. మంచి బుద్ధితో మసలుకొమ్మని హెచ్చరించెను.

ద్రౌపది వలన తిరస్కరింపబడిన కీచకుడు కామ వివశుడై సోదరి

సుదేష్ణవద్దకు వెళ్ళి తన బాధను వెళ్ళగ్రక్కెను. సుదేష్ణ తనసోదరుని సముదాయించుటకు ప్రయత్నించెను. గాని ఫలితములేదు. చివరకు సోదర ప్రేమ కారణంచే ఆమె కీచకుడు ద్రౌపదిని పొందు ఉపాయమునాలోచించి

అతనితో సోదర! ఏదేని పండుగ రోజున నీయింట మద్యము, అన్నపానీయములను తయారు చేయించుము మద్యమును తీసుకురమ్మనమను వ్యాజముతో ద్రౌపదిని నీవద్దకు పంపెదనని చెప్పెను. సోదరివలన ఆశ్వాసమును పొంది కీచకుడు అక్కడినుండి వెడలి పోయెను.

ఒక రోజున పండుగనాడు కీచకుని యింట అన్న పానీయాది వ్యవస్థ చేయబడినది. ఈ విషయమును సోదరిని తనయింటికి రప్పించి ఆమెతో చెప్పి ద్రౌపదిని తనవద్దకు పంపమని కోరెను. వెంటనే సుదేష్ణ ఇంటికి వెళ్ళి ద్రౌపదిని కీచకుని యింటికి వెళ్ళి
మదిరను తీసుకురమ్మనమని ఆదేశించెను. ఆమె పాత్రను తీసుకొని మనస్సులో కీడును శంకిస్తూ విచారిస్తూ మనస్సులో సూర్యభగవానుని ప్రార్థిస్తూ కీచకుని యింటికి వెళ్ళెను. ఆమెను చూడగానే కీచకుడు మిక్కిలి సంతోషించి ఆమె కుడి చేయి పట్టుకొని వశము చేసుకొనుటకు ప్రయత్నించెను. అప్పుడు ద్రౌపది కీచకుని నేలమీదకు నెట్టి రక్షణకొఱకు రాజసభవైపు పరిగెత్తెను. అచ్చట యుధిష్ఠిరుడు కూడా ఉండెను. పడిలేచిన కీచకుడు పరుగెత్తెడి ద్రౌపది వెంటబడి ఆమెను నేలమీద పడవేసి కాలితో తన్నెను. ఇంతలో సూర్యభగవానునిద్వారా ద్రౌపది రక్షణ కొఱకు నియోగింపబడిన రాక్షసుడు కీచకుని పట్టుకొని దూరముగా విసిరివేసెను. నిశ్చేష్టుడై అతడు నేలపై పడెను. ఆసమయమున యుధిష్ఠిరునితో బాటు భీమసేనుడు కూడా సభలోనుండెను. రహస్యము బయటపడునని చెప్పి భీమసేనుని కోపమును యుధిష్ఠిరుడు చల్లార్చెను. రక్షించమని ద్రౌపది మత్స్యనరేశుని వేడుకొనెను. కాని విరాటుడు కీచకుని దండించుటకు అసమర్థుడు. కనుక శాంతి పూర్వకముగ అతనిని సముదాయించెను. ద్రౌపది మాటలతో మత్స్యనరేశుని ధిక్కరిస్తూ ఇట్లనెను. కీచకునికి ఇసుమంతయు ధర్మజ్ఞానము లేదు. మత్స్యరాజగు మీరు కూడా ఏవిధముగా ధర్మజ్ఞులుకారు. అధర్మియగు రాజువద్ద ఉండువారు కూడా అధార్మికులేయని పలికెను. అంతట విరాటుడు ఆమెతో నా పరోక్షమున మీయిద్దరిమధ్య కలహము జరిగినది. కనుక వాస్తవమును తెలుసుకోకుండా న్యాయము చేయలేనని చెప్పెను. సభాసదులు కీచకుని నిందిస్తూ

సైరంధ్రిని ప్రశంసించిరి. యుధిష్ఠిరుడు చెప్పగా సైరంధ్రి దూకుడుగా సుదేష్ణభవనమునకు వెళ్ళెను. కీచకవధకు ఆమె దీక్షబూనినది.

కీచకవధను గూర్చి ఆలోచిస్తూ ద్రౌపది భీమసేనుని గదికి వెడలి నిద్రిస్తున్న అతనిని మేల్కొలిపెను. వచ్చిన కారణమును చెప్పి తొందరగా శయన గృహమునుండి వెళ్ళవలసినది. లేకపోయిన ఎవరైనా చూచెదరని భీముడు ద్రౌపదిని కోరెను. ద్రౌపది పాండవుల దుర్దశకు చింతిస్తూ సమస్త అనర్థములకు నేనే కారణము. కీచకుని బారిన పడుటకంటె విషము తీసుకొని ప్రాణములు విడుచుట మేలు. అని చెప్పి అతని హృదయముపైబడి వెక్కి వెక్కి యేడ్చెను. ఆమెను ఓదారుస్తూ భీముడు నేను ఈరోజు సోదర బంధువులతో సహా కీచకుని చంపెదను. దుఃఖమును దిగమ్రింగి నీవు కీచకుని కలసి రాబోవురాత్రి సమయమున నృత్యశాలకు రమ్మనమని చెప్పుము. అతడు అక్కడకు వచ్చిన తరువాత తరువాయి విషయము నేను చూసు కొందునని చెప్పెను. పిమ్మట ద్రౌపది అక్కడి నుండి వెడలెను.

రాత్రి గడవగా ఉదయముననే కీచకుడు లేచి రాజ భవనమునకు వెళ్ళి ద్రౌపదితో సైరంధ్రి! ఇక్కడ సైన్యమునకు నేనే యజమానిని. నిన్ను ఎవ్వరు రక్షించలేరు. ఇప్పుడు మన యిద్దరి సమాగమము జరిగి తీరవలెనని హెచ్చరించెను. భీమసేనుని మాటలను స్మరించుచు ద్రౌపది కీచక! నాదొక షరతును అంగీకరింపుము. నీవు నన్ను కలియుటకు వచ్చెదవన్న సంగతి ఎవ్వరికీ తెలియకూడదు. దీనినంగీకరించిన నేను నీ వశమగుదునని పలుకగా కీచకుడంగీకరించి నేను ఈ రాత్రి నిన్ను కలియుటకు నృత్యశాలకు ఒంటరిగా వచ్చెదనని చెప్పెను. సైరంధ్రిరూపంలో మృత్యువు తనను కబళించుచున్నదని పాపము కీచకుడెరుగడు. నృత్యశాలకు కీచకుడు రాబోవు సమాచారమును ద్రౌపది భీమసేనునికి తెలియజెసెను. భీమసేనుడు ముందుగానే నృత్యశాలను ప్రవేశించి ప్రక్కపై పరుండెను. ద్రౌపదీ సమాగమమును కోరు కీచకుడు నృత్యశాలకు వచ్చి అక్కడ శయ్యపై పరుండినది సైరంధ్రియని తలచి స్పృశించెను. కోపంతో ఉప్పొంగు భీమసేనుడు ఒక్కసారిగా అతనిపైకి ఉరికెను. ఇద్దరి మధ్య ఘోర యుద్ధము జరిగెను. చివరకు భీముడు కీచకుని చంపి కోపమును చల్లార్చుకొని ద్రౌపది నుండి సెలవుతీసుకొని పాకశాలకు వెడలిపోయెను. కీచకుడు చంపబడగా ద్రౌపది మిక్కిలి

సంతోషించినది. సభాభవన రక్షకుల వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్ళి ద్రౌపది తన భర్తలగు గంధర్వులచే మదోన్మత్తుడగు కీచకుడు చంపబడ్డాడు. అతడు నృత్యశాలలో పడియున్నాడని తెలిపెను. విషయము తెలుసుకొని కీచకుని బంధుగణము అచ్చటకు వచ్చి విలపించిరి. సైరంధ్రి అచ్చట స్తంభమును ఆశ్రయముగా చేసుకొని నిలబడుటను గమనించిరి. రాజు అనుమతిని పొంది కీచకుని మృత శరీరంతోబాటు సైరంధ్రిని కూడా తగుల బెట్టుటకు వారు శ్మశాన భూమికి తీసుకువెళ్ళిరి. ఆమె ఆర్తనాదములు విన్న భీమసేనుడు ఉపకీచకులను చంపుటకు వేషము మార్చుకొని శ్మశానభూమిని చేరి అచ్చట 105 ఉప కీచకులను చంపి ద్రౌపదిని విడిపించెను. విషయము తెలుసుకొన్న విరాటరాజు మిక్కిలి భయబడి సైరంధ్రిని తనయిష్టము వచ్చిన ప్రదేశమునకు వెళ్ళిపొమ్మని చెప్పమని రాణి సుదేష్ణను కోరెను. ద్రౌపది అక్కడ ఉండుటకు పదమూడు రోజులు గడువు కోరెను. సైరంధ్రి మాటలు విన్న సుదేష్ణ ఆమెతో నీవు ఇష్టమున్నంతవరకు ఇక్కడ ఉండుము. కాని పతి, పుత్రులను రక్షించమని వేడెను.

**4) గోహరణ పర్వము:-**

ఈ పర్వమందు 45 అధ్యాయములుగలవు. అజ్ఞాతవాసమున నున్న పాండవుల
జాడ కనుక్కొనుటకు దుర్యోధనునిచే పంపబడిన గూఢచారులు హస్తినాపురమునకు తిరిగి వచ్చి ద్రోణ,కర్ణ, కృపాచార్య, భీష్మాదులతో నిండిన రాజసభలో దుర్యోధనుని కలిసిరి. వారు అతనితో నరేంద్ర! పాండవుల జాడ తెలుసుకొనుటకు నలుమూలల వెదకితిమి. కాని తెలుసుకొన లేకపోతిమి. వారు నశించియుండ వచ్చునని మా ఊహ. ద్వారక యందు కూడా లేరు. సంతోషమును కల్గించు వార్త ఏమనగా గంధర్వులు సోదరులతో సహా కీచుకుని చంపి వేసిరని చెప్పి వారు రాజుయొక్క తదుపరి ఆదేశమునకు వేచియుంటిరి. దుర్యోధనుడు గుప్తచరులను పదమూడవ సంవత్సరమున పాండవుల అజ్ఞాతవాసంలో చాలా భాగము గడిచినది. కొన్ని రోజులు మాత్రమే మిగిలి యున్నవి. నిగూఢ వేషంలో ఎక్కడైనా దాగియుందురు. కనుక మీరు వెంటనే వారి జాడ తెలుసుకొనుటకు ప్రయత్నింపుడని ఆదేశించెను. అది విని కర్ణుడు

వీరుగాక వేరే సమర్థులగు గుప్తచరులను పంపమని దుర్యోధనునికి సలహా ఇచ్చెను. దుశ్శాసనుడు కర్ణుని వచనములను సమర్థించెను. పిమ్మట ద్రోణాచార్యుడు పాండవులు సమయముకోసం వేచియుంటిరి. వారు నాశముపొందియుండరు. చేయవలసినది ఆలస్యములేకుండా వెంటనే చేయ వలసియున్నది. పాండవులను బాగా గుర్తింపగల్గిన వాళ్ళనే పంపవలెనని చెప్పెను. భీష్ముడు యుధిష్ఠిరుని ప్రశంసిస్తూ ఇట్లుపలికెను. పాండవులు ధర్మము, పరాక్రమములచే సురక్షితముగానే ఉండియుందురన్నది నానమ్మకము. ఏదేశమున యుధిష్ఠిరుడు ఉండునో ఆదేశము సుభిక్షాసంపన్నమై యుండును. అట్టి లక్షణములను చెప్పి శుభలక్షణములుగల దేశమందే పాండవులు దాగియుందురు. కనుక దుర్యోధన! బాగుగా ఆలోచించి చేయవలసినది తొందరగా చేయుమని ఉపదేశించెను. పిమ్మట కృపాచార్యుడు భీష్ముని మాటలను సమర్థిస్తూ కర్తవ్యోపదేశము చేసెను.

ద్రౌపదికారణంగా భీమసేనుడే గంధర్వులను పేరుతో కీచకుని చంపి వేసెనేమోయని దుర్యోధనుడు సందేహము వ్యక్తము చేసెను. భీష్ముడు చెప్పిన శుభలక్షణములు మత్స్యదేశమున ఎక్కువగా కనబడుచున్నవి. కనుక మత్స్యదేశముపై మనం దండెత్త వలయునని దుర్యోధనుడు చెప్పగా త్రిగర్త దేశపురాజుగు సుశర్మతప్పక ఆదేశముపై దండెత్తవలెనని సూచించెను. కర్ణుడు దానిని సమర్థించెను. మత్స్యదేశముపై దండెత్తుటకు పెద్దల అనుమతి తీసుకొని, సైన్యమును సిద్ధము చేయు బాధ్యతను దుర్యోధనుడు శకునికి అప్పగించెను. ముందుగా సుశర్మ తన సేనతో నిశ్చిత ప్రదేశమునకు వెళ్ళును. పిమ్మట ఒకరోజు తరువాత మనము అక్కడకు వెళ్ళెదము. అందరూ కలసి విరాటనగరముపై దండెత్తెదము. మొదట గోపాలురు దగ్గరకు వెళ్ళి
గోసంపదను అపహరించెదమని దుర్యోధనుడు పేర్కొనెను. ముందుగా నిర్ణయించిన దాని ప్రకారము కృష్ణపక్షము సప్తమినాడు సుశర్మ సైన్యముతో బయలుదేరెను. మరునాడు అష్టమి రోజున అందరూ కలసి గోకులమును స్వాధీనపరచుకొనిరి.

విరాటుని కొలువులో పాండవుల అజ్ఞాతవాసము ఇంచుమించు పూర్తి కావచ్చెను. విరాటరాజు మంత్రులు, పాండవులతో కొలువుదీరి యుండగా గోరక్షకులు వచ్చి త్రిగర్తసైనికులు మమ్ములను జయించి గోసంపదను

అపహరించి తీసుకొని పోవుచున్నారని విన్నవించిరి. అదివిని విరాట రాజు సైన్యమును సిద్ధముజేసి పాండవులతో సహా యుద్ధమునకు వెడలెను. మత్స్యత్రిగర్తీయ సేనల మధ్య ఘోర యుద్ధము జరిగెను. రెండవరోజు యుద్ధమున సుశర్మ మత్స్యదేశ సైన్యమును చిందరవందర చేసి విరాటరాజును పట్టుకొనెను. విషయం తెలుసుకొని యుధిష్ఠిరుడు విరాటుని విడిపించుటకు భీమసేనుని ఆదేశించెను. భీముడు. సుశర్మరథాశ్వములను చంపి అతనిని ఓడించి త్రాళ్ళతోకట్టి ధర్మరాజు వద్దకు తీసుకు వచ్చెను అన్నగారి ఆనతి ప్రకారం భీముడు సుశర్మను విడిచిపెట్టెను. సుశర్మ విరాటునికి నమస్కరించి తన దేశమునకు వెడలెను. దీనినే దక్షిణ గోగ్రహణమందురు.

విరాటరాజు తన గోసంపదను విడిపించు కొనుటకు త్రిగర్తదేశీయులతో యుద్ధము చేయుటకు వెడలగా భీష్మ, కర్ణ, ద్రోణాదులతో కూడి దుర్యోధనుడు విరాట దేశముపై దండెత్తి గోవులనపహరించెను. గోరక్షకులు భయపడి రాజ భవనమునకు వచ్చి విరాటుని పుత్రుడగు (భూమింజయుని) ఉత్తరుని కలిసి పశువుల నపహరించిన విషయము విన్నవించిరి. ఉత్తరుడు యుద్ధమునకు బయలుదేర నిశ్చయించి యోగ్యుడగు రథసారథిని వెదకసాగెను. అతని సారథి ముందరి యుద్ధమున మరణించెను. పాండవుల అజ్ఞాతవాస అవధి పూర్తి యగుటచే అర్జునుడు ద్రౌపదిని పిలిచి ఏకాంతమున ఆమెతో నీవు ఉత్తరవద్దకు వెళ్ళి బృహన్నల అర్జునుని ప్రియరథసారథి. నీవు కోరినచో అతడు నీకు రథసారథి కాగలడని చెప్పమని చెప్పెను. ద్రౌపది సూచనను ఉత్తర తన సోదరునకు చెప్పగా అతడు బృహన్నలను తీసుకురమ్మనమని చెప్పెను.

పిమ్మట రాజకుమారుడు ఉత్తరుడు బృహన్నలను సారథిగా చేసుకొని యుద్ధక్షేత్రమునకు బయలుదేరెను. ఆసమయమున ఉత్తర, ఆమెసఖులు బృహన్నల తో భీష్మాదులను జయించి వారి చిత్రములగు వస్త్రములను బొమ్మల నలంకరించుకొనుటకై తీసుకురమ్మనమని కోరిరి. రాజకుమారుడు యుద్ధమున భీష్మాదులను ఓడించిన తప్పక మీరు కోరినవి తీసుకు వచ్చెదనని పలికెను. ఉత్తరుడు
కౌరవసైన్యము వద్దకు రథమును తీసుకు వెళ్ళమని బృహన్నలను ఆదేశించెను. అసంఖ్యాక కౌరవసేన ఉన్న ప్రదేశమునకు అర్జునుడు

రథమును తీసుకు వెళ్ళసాగెను. కర్ణ, దుర్యోధన, కృపాచార్య, భీష్మ, ద్రోణాదుల రక్షణలో నున్న అసంఖ్యాక కౌరవసేననుచూచి ఉత్తరకుమారుడు భయముతో వణికి బృహన్నలతో నన్ను ఎవరు అపహాస్యము చేసినను, గోవులన్నియు మరలిపోయినను నాకీ యుద్ధముతో పనిలేదని చెప్పి అభిమానమును విడిచి రథమునుండి దూకి పారిపోవసాగెను. అతనిని నిలుపుచేయుటకు అర్జునుడు వెంటబడి అతని జుట్టును పట్టుకొనెను. అతనికి ధైర్యంచెబుతూ అర్జునుడు నేను కౌరవులతో యుద్ధము చేసెదను. నీవు కేవలము రథసారథిగా నుండుమని సముదాయించెను. గాండీవమును తీసుకొనుటకు అర్జునుడు ఉత్తరుని రథముపై కూర్చుండ బెట్టుకొని అతనితో కూడా శమీవృక్షము వైపునకు వెళ్ళెను. బృహన్నలను అర్జుననిగా అనుమానించి భీష్మ ద్రోణాదులు అతనిని ప్రశంసించిరి. కర్ణుడు వారిని వారించబోవ దుర్యోధనుడు కర్ణ! బృహన్నల రూపమున నున్న వాడు అర్జునుడైనచో మంచి విషయమే. అజ్ఞాతవాసము పూర్తికాకుండా కనుగొనబడుటచే తిరిగి పండ్రెండు సంవత్సరములు వనవాసము చేయవలెను. అర్జునుడు కాక మరియొకడైనచో మట్టికరిపించెదనని ప్రగల్భములు పలికెను.

శమీవృక్షము వద్దకు వెళ్ళి అర్జునుడు ఉత్తరునితో పాండవులు ధనుర్బాణములను ఈ వృక్షమునందుంచితిరి. అందు అర్జునుని శక్తిశాలియగు గాండీవము గూడా గలదని చెప్పి శమీవృక్షమునుండి అస్త్రములను క్రిందికి దింపుమని ఉత్తరుని ఆదేశించెను. ఈ వృక్షముపైమృత శరీరము వ్రేలాడుచున్నది దానిని నేను ఎట్లు స్పృశించెదనని సందేహము వ్యక్తముచేయ అర్జునుడు అతని సందేహమును నివృత్తిచేసెను. ఉత్తరుడు అతని ఆదేశమును పాటించి దివ్యాస్త్రములను చూచి ఆశ్చర్యచకితుడాయెను. అతడు అడుగగా అర్జునుడు తన, తనసోదరుల పరిచయముచేసెను. పిమ్మట రాకుమారుడు అర్జునునికి నమస్కరించి నా అదృష్టంచే మీకు రథసారథిని యగుచున్నానని పలికెను.

ఉత్తరుడు శమీవృక్షము నుండి ఆయుధములన్నిటిని తీసుకు వచ్చెను. వ్రతసమాప్తియగుటచే అర్జునుని నపుంసక రూపము తొలగిపోయెను. ఉత్తరుని సారథిగా చేసుకొని అర్జునుడు శమీవృక్షమునకు ప్రదక్షిణమొనర్చి అస్త్రశస్త్రములు తీసుకొని యుద్ధమునకు వెడలెను.

అతడు శంఖము పూరించగా కౌరవసేన భయంతో కంపించెను. వచ్చువాడు అర్జునుడు తప్పమరొకడు కాదని ద్రోణాచార్యుడు చెబుతూ దుర్యోధన! అమంగళమగు అపశకునములు ఎన్నియో కలుగుచున్నవి. సైనికులందరు
నిరుత్సాహులైతిరి. కనుక ఆవులను పంపి యుద్ధమునకు వ్యూహము పన్నెదమని తెలియజేసెను. పిమ్మట దుర్యోధనుడు పాండవుల వనవాసమున పదమూడవ సంవత్సరము పూర్తికాలేదు. అజ్ఞాతవాసమున పాండవులు బయటపడినచో తిరిగి పండ్రెండు సంవత్సరములు వనవాసము చేయవలెను. వారి వనవాస అవధి పూర్తి అయినదా? లేదా? ఈ విషయము భీష్మునకు తెలుసును. వచ్చువాడు అర్జునుడు అయినను కాకపోయినప్పటికి మనం తప్పక యుద్ధం చేయవలెనని పలికెను. కర్ణుడు అతని మాటలను సమర్థిస్తూ నేనొక్కడినే ఒంటరిగా అర్జునుని ఎదుర్కొందునని అహంకారము వ్యక్తముచేసెను. కృపాచార్యుడు అతని అనుచిత వ్యవహారమును నిరసిస్తూ అందరూ కలసి యుద్ధము చేసెదమని ప్రస్తావించెను. అశ్వత్థామ కూడా కర్ణ దుర్యోధనుల వ్యవహారమును నిందిస్తూ నేను అర్జునునితో యుద్ధము చేయను. మత్స్యనరేశునితోనే యుద్ధము చేసెదనని గట్టిగా చెప్పెను. భీష్ముడు అందరిని శాంతపరచి ఆచార్యపుత్ర! శాంతింపుడు. మహాకార్యము ఆసన్నమైనది. మనలో మనం విరోధించుకొనుట తగదు. మనం అందరం కలసి యుద్ధం చేసెదమని చెప్పెను. దుర్యోధనుడు కర్ణ భీష్మాదులను క్షమించమని అడిగెను. ద్రోణాచార్యుడు భీష్ముని పాండవుల అజ్ఞాతవాస అవధి గూర్చి అడిగెను.

భీష్ముడు ఇట్లు చెప్పెను కల, కాష్ఠము, ముహూర్తము మొదలగు వానిద్వారా కాల చక్రము నడుచుచున్నది. అవాంతర విభాగముల వృద్ధిక్షయములు, నక్షత్రగతి వ్యత్యాసమువలన ప్రతి అయిదు సంవత్సరములలో రెండు నెలలు అధిక మాసములు వచ్చుచున్నవి. ఈ విధముగ పాండవుల వనవాసము 13 సంవత్సరములు పూర్తియగునప్పటికి అయిదు నెలల పండ్రెండు రోజులు ఎక్కువగా గడిచినవి. ఈ విధముగా సంశయనివృత్తిగావించి భీష్ముడు దుర్యోధనుని సంధిచేసుకొనుమని ఉపదేశించెను. కాని దుర్యోధనుడు భీష్ముని ప్రస్తావనను నిర్ద్వంద్వముగా తిరస్కరించి యుద్ధమునకు ఏర్పాట్లుగావించమని ఆదేశించెను. భీష్ముడు అతని మాటలను

అంగీకరించి దుర్యోధన! సేనలోని నాల్గవ భాగమును తీసుకొని నీవు హస్తినకు వెళ్ళుము. రెండవ నాల్గవభాగము గోవులను తీసుకొని వెడలును. మిగిలిన సగం సైన్యంతో మేము అర్జునుని ఎదుర్కొందుమని పలికి మొదటగా దుర్యోధనుని, పిమ్మట గోసంపదను పంపివేసి సేనావ్యూహరచన గావించెను. కేవలము దుర్యోధనునితో యుద్ధము చేసి అతనిని జయించి ఆవులను మరల్చవలెనని అర్జునుని సంకల్పము. కనుక అతడు దుర్యోధనుడు వెడలిన వైపునకు రథము మరల్చెను. కౌరవసేనను చిందర

వందర చేసి ఆవులను విడిపించి దుర్యోధనునితో తలపడుటకు అతని వద్దకు బయలుదేరెను. ఇంతలో కర్ణార్జునుల మధ్య ఘోర యుద్ధము జరిగెను. అర్జునుని ముందు నిలువ లేక కర్ణుడు యుద్ధభూమిని విడిచి పారిపోయెను. కృపాచార్యుడు కూడా అర్జునుని యెదుట నిలువ లేక పోయెను. ద్రోణాచార్యుడు అర్జునునికి యెదురుపడగా అర్జునుడు గురువందనమొనర్చి బాణములు సంధింపమని కోరెను. ద్రోణుడు వేసిన 21 బాణములను అర్జునుడు మధ్యలోనే ఖండించెను. ఇద్దరి మధ్య ఘోరయుద్ధము జరిగెను. చివరకు గాయపడిన ద్రోణుడు వెనుదిరిగెను. దుశ్శాసనులది కూడా అదే దుస్థితి. భీష్మార్జునుల యుద్ధమున మూర్ఛబోయిన భీష్ముని రథసారథి యుద్ధభూమినుండి తీసుకు వెళ్ళెను. దుర్యోధనుడు కూడా యుద్ధమైదానమును విడిచి పెట్టెను. పరాజితమైన కౌరవసేన హస్తినాపురమునకు వెడలగా విజయుడగు అర్జునుడు విరాటనగరమునకు బయలుదేరెను.

విరాటరాజు దక్షిణ గోగ్రహణమున విజయము పొంది ఆవులను విడిపించి పాండవులతో నగరమునకు చేరుకొనెను. అందరూ సంతోషించిరి. బృహన్నలను సారథిగా చేసుకొని ఉత్తరగోగ్రహణమున కౌరవసైన్యమును ఎదుర్కొనుటకు తన కుమారుడైన ఉత్తరుడు వెడలినాడని తెలుసుకొని విరాటరాజు వ్యథచెందెను. యుధిష్ఠిరుడు రాజునకు ధైర్యముచెప్పెను. ఇంతలో దూతలు వచ్చి ఉత్తర కుమారుని విజయ వార్తను వినిపించిరి. మిక్కిలి సంతసించిన రాజు ద్యూతము ప్రారంభించమని యుధిష్ఠిరునికి చెప్పెను. ద్యూతక్రీడ దోషగ్రస్తమైనది. కనుక దానినిత్యజింపుమని యుధిష్ఠిరుడు సలహాచెప్పెను. అయినను ద్యూతక్రీడ ఆరంభమైనది. బృహన్నల సారథిగా కల్గినవాడు యుద్ధమున

తప్పక జయించగలడని ధర్మరాజు చెప్పగా కోపగించి విరాటరాజు అతనిని నిందించెను. పిమ్మట ఉత్తరుడు వచ్చి వృత్తాంతమంతయు తండ్రికి నివేదిస్తూ ఇది నేను చేసిన పనికాదు. ఎవరో దేవకుమారుడు ఇదంతయు చేసినాడు రేపుగాని ఎల్లుండిగాని ప్రకటితమగునని చెప్పెను. మహారథుల శరీరముల నుండి గ్రహించిన విచిత్రవస్త్రములను బృహన్నల విరాటకన్య ఉత్తరకు బహూకరించెను.

**5) వైవాహిక పర్వము:-**

ఈ ఉప పర్వమున మూడు అధ్యాయములు గలవు. నియమిత సమయంవరకు ప్రతిజ్ఞాపాలన చేసి మూడవరోజున స్నానాదులనుముగించుకొని పాండవులు విరాటుని చేరిరి. ఉత్తరుడు తన తండ్రికి పాండవులను పరిచయం చేస్తూ అర్జునుని పరాక్రమమును వర్ణించెను. విరాటుడు యుధిష్ఠిరుని క్షమించమని యడిగి సంపూర్ణరాజ్యమును వారికి సమర్పించెను. తన కూతురు ఉత్తరను గ్రహించమని విరాటుడు అర్జునుని వేడెను. అర్జునుడు ఆమెను కోడలిగా స్వీకరించెను. యుధిష్ఠిరుని ఆహ్వానమునందు కొని వాసుదేవాదులు వివాహమునకువచ్చిరి. అభిమన్యువివాహము ఉత్తరతో జరిగెను.

**ఇది విరాటపర్వ కథాంశము.**